చిట్టి కథ

# సైగలు

సాయంత్రం చల్లగా ఉంటుందని డాబా మీదకు వెళ్లాను. ఎదురింటి డాబా ఇంటికి క్రొత్తగా చేరినతను ఏదో సైగ చేశాడు. ఉలిక్కిపడ్డాను. పరిశీలించి చూశాను. సైగ చేసింది నాకు కాదు. మా ప్రక్క డాబాలో ఉంటున్న సుధకు అని గ్రహించాను. ఈ పిల్ల కూడా చేస్తోందా సైగలు అని వాళ్లకు కనిపించకుండా సి. ఐ. డి. పని చేసి చూశాను. ఆహా! చాలా అందంగా చేస్తోంది సైగలు! పాపం! అమ్మడు! నాకు నవ్వు వచ్చింది! ప్రేమించుకుంటున్నారు కాబోలు. పోన్లే పాపం! నేనెలాగూ ప్రేమిద్దామంటే టైం లేకపోయింది. పోనీ పెళ్లయ్యాక ప్రేమిద్దామనుకుంటే వరుసగా త్రీ మెంబర్స్ పుట్టుకొచ్చారు. పిల్లలు కాస్త పెద్దవాళ్లయ్యారుకదా ఇప్పుడైనా తీరిగ్గా ప్రేమిద్దామంటే మావారు ఆముదం తాగిన మొహం పెడతారు. ఏదో ఖర్మ కొద్దీ ఎప్పుడైనా ఆయనకు బుద్ధి మారి ప్రేమించుకొందామనుకుంటే సరిగ్గా ఆ టైంకు ఎవరో ఒకరు ఊడిపడ్తారు. ఎప్పటికప్పుడు వాయిదా వేస్తున్నాను. ఈ రోజుల్లో అందరూ మంచి నీళ్లు త్రాగినంత సుళువుగా ప్రేమించేసుకుంటున్నారు. నాకు ప్రేమించే యోగం లేదు! సుధ, అతను ఎలా ప్రేమించుకుంటారో చూసి తరిస్తాను. అవునూ! అతగాడికి పెళ్లయిందని పెళ్లాం పురిటికెళ్లిందని పని మనిషి చెప్పిందే? ఓర్నీ దుంపతెగ! ఏం పొయ్యేకాలం వచ్చిందీ! పెళ్లికాని పిల్లను నాశనం చేయ్యాలనుకుంటున్నాడా? అయినా అతనిదేం తప్పు! దీనికి బుద్ధుండొద్దూ? ఒకవేళ అతను కోతిచేష్టలు చేస్తూ, సైగలు చేస్తూంటే ఇది నోరు మూసుకుని ఉండొద్దూ! "తందాన తానా" అంటూ ఇదీ చేస్తోంది సైగలు. అతనికి పెళ్లయినట్టు తెలీదా దీనికి? ఏమో?

ఓ వారం రోజులు గడిచాయి. ఓ రోజు సుధ నా దగ్గరికి వచ్చి, "అక్కయ్యా! నీకో విషయం చెప్పనా! ఎవరికీ చెప్పకేం!" అంది. ఒట్టు వేశాను సుధ వాళ్ల అమ్మమ్మ మీద! (ఆవిడ మంచాన పడిందిలెండి! ఎలాగూపోతుందని!) "ఎదిరింటి డాబా అతను లేడూ! అతనూ నేనూ ప్రేమించుకున్నాం. (నా కప్పుడే తెలుసులేవే సన్నాసీ! ప్రేమట! ప్రేమ! ఎంత చీప్‌గా దొరుకుతోందో ఈ రోజుల్లో ప్రేమ!) నువ్వు మా నాన్నగారితో చెపుతావా? మేం పెళ్లి చేసుకోవాలనుకున్నాము. నువ్వే ఎలాగైనా ఒప్పించాలి. ప్లీజ్! హెల్ప్ మీ." "అలాగే చెబుతాను కానీ మీరెట్టెట్టా ప్రేమించుకున్నారో కాస్త చెప్పవే!" అన్నాను. అదికాస్త సిగ్గుపడి "పో అక్కయ్యా! అతను నాకు రోజూ లెటరు రాసిస్తాడు. నేను కూడా బదులు వ్రాస్తాను" అంది.

"అతనక్కడ! నీ విక్కడ. లెటర్సు అంటున్నావేమిటే!" అన్నాను. "మా నానిగాడితో పంపుతాడు. నేను కూడా వాడితోనే లెటరిచ్చి పంపుతున్నాను" (ఓసి! నీ దుంపతెగ పోస్ట్‌మేన్‌ను కూడా పెట్టుకున్నావా? ఉండు నీ పని చెబుతాను) "అది సరేలే! అతను నిన్ను పెళ్లి చేసుకుంటాడటనా?" అడిగాను.

"అడగలేదు! అయినా ప్రేమించుకున్నాక పెళ్లి చేసుకోడేమిటి"? అంది అమాయకంగా.

"ఓసి! పిచ్చి మొహమా! ఈ కాలంలో షోకేసులో బొమ్మనుకూడా ప్రేమించామంటున్నారు. ముందు పెళ్లి చేసుకుంటాడేమో అడుగు. అదీ రిజిష్టరు మ్యారేజి అయితేనే. అర్థమయిందా? ఇంతకూ నీకు లెటర్‌లో ఏం వ్రాస్తున్నాడేమిటి?"

"పార్కుకు రమ్మని, సినిమాకి రమ్మని ఏదేదో వ్రాశాడులే" అంది ముసి ముసిగా నవ్వుతూ! (రాయడూ మరి! నువ్వంత అందంగా పోజులిస్తూ సైగలు చేస్తుంటే! సిగ్గులేకపోతే సరి!) "అయితే అక్కయ్యా! ఈ రోజు లెటరులో నన్ను పెళ్లి చేసుకుంటావా? అని రాయనా!" అంది (అలాగే ఏడు) "అవును సుధా! లేకపోతే చాలా డేంజర్ సుమా! ముందు పెళ్లి చేసుకుంటే ఎన్నాళ్లయినా అలా ప్రేమించుకుంటూండచ్చు"!

"అలాగే"! అంటూ వెళ్లిపోయింది.

ఈ వయసుండే ఇది ఒక భయంకరమైన కొండ చరియలో ప్రయాణంలాటిది. దానికి సరైన చేయూత లభిస్తే గమ్యం వైపు సాఫీగా సాగుతుంది! లేకుంటే తెగిన గాలిపటంలా అంతు చిక్కదు. సుధ అలా కావటానికి వీల్లేదు. ఇది ప్రేమ ప్రేమ అని భ్రమ పడుతోంది. అతను నిజంగానే ప్రేమిస్తున్నాడనుకుంటోంది! ఇది కేవలం వయసులో కలిగే ఆకర్షణ, వ్యామోహం అని ఈ అమాయకురాలికెలా అర్థమవుతుంది. మరుసటి రోజు సుధ బిక్కమోహం పెట్టుకుని 'ఇదిగో రాసిందానికి రిప్లై' అంటూ ఇచ్చింది.

డియర్ సుధా,

పెళ్లి చేసుకోమని వ్రాశావు. ప్రేమించుకుంటే ఉన్నప్పటి థ్రిల్ పెళ్లిచేసుకుంటే ఉండదు. (అన్ని రకాల థ్రిల్స్ అనుభవించినట్టున్నావే) అది ప్రేమకు మాత్రమే పరిమితం చేసుకోవాలి (ఏ సినిమాలో డైలాగు నాన్నా ఇది) పెళ్లి అంటే నాకు గిట్టదు. తొందరపడి నేను పెళ్లిచేసుకుని నరకం అనుభవిస్తున్నాను (అయ్యోపాపం ఏడవలేక పోయావా?) నీవు నా అభిప్రాయాలతో ఏకీభవిస్తావని ఆశిస్తాను. మళ్లీ మా ఆవిడ ఊర్నించి వస్తుంది (ఏం వస్తే! చీపురు తీసుకొస్తుందా నీ మీదకు) నీవు ఈ రోజు సాయంకాలం 7 గంటలకు మా యింటికి రా! నీతో చాలా మాట్లాడాలి. (ఇంకా ఏం మాట్లాడతావు నాన్నా - బుజ్జి తండ్రీ కొంప ముంచుదామనుకున్నావా).

"అక్కయ్యా! సాయంకాలం వెళితే ఏం! ఒకసారి మాట్లాడి వస్తాను!" అంది సుధ. నాకు వళ్లు మండింది. "వెళితే ఏం! వెళ్లు! ఇంక మాట్లాడేదేం ఉండదు. కొంప నిలువునా ముంచుతాడు. ఆ తర్వాత నీవు మళ్లీ నెలకంతా చింతకాయలు కావాలంటావు. నాలుగుసార్లు డోక్కుంటావు. ఇంకా నాలుగు నెలలు గడవగానే కడుపొస్తుంది. మీనాన్న............ఏమిటి వింటున్నావా? మీ నాన్న ఉరేసుకుంటాడు. ఇవన్నీ జ్ఞాపకం ఉంచుకుని వాడి రూంకెళ్లు. పిచ్చి మొహమా! దీన్ని ప్రేమ అనరే! ప్రేమకు అర్థం చెప్పినా నీ కర్థం కాదు. నా మాటకు విలువ ఇవ్వాలి అనుకుంటే అతనితో స్నేహం మానెయ్యి, నేనేం చెప్పినా నీ మేలు కోరే! ఇదే నేనివ్వగల సలహా; చేయగల సహాయం! వెళ్లు!"

అంతే! సుధ మళ్ళీ అతనివేపు చూడలేదు; సైగలూ చెయ్యలేదు!

—ఎ. జయలక్ష్మిరాజా